ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 09 మే , 2025 | పేజీలు : 06





వివరాలు మెయిన్‌లో

ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్రలు : కాంతయ్య

# అర్హులైన పేదలకు ఇండ్లు కట్టిస్తాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్)** : కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఇరవై లక్షల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదవారికి కట్టించిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నమూనాను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నేర్చేందుకే ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టామని, ఇట్టి ప్రక్రియ పారదర్శకంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి మొదటి విడతలో కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే నాల్గు సంవత్సరాలలో విడతల వారీగా అర్హులైన పేదవారందరీకి ఇండ్లు ఇస్తామని, మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ళను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదవారందరికి 20 లక్షల ఇండ్లను రూ.5 లక్షలతో కట్టిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నామని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటి ఏర్పాటు చేసి రెండు వందల ఇండ్లకు ఒక గెజిటేడ్ అధికారిని ఏర్పాటు చేసి సర్వే నిర్వహించిన తర్వాత జాబితా రూపొందించామని, ఆ జాబితాను ఇన్‌చార్జి మినిస్టర్ ఆమోదంతో లబ్ధిదారులకు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ బిసి కార్పోరేషన్ ఛైర్మన్ అమిత్ రెడ్డి, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ,



మిర్యాలగూడ సబ్ కలెక్టర్ , ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ, పిడి రాజ్ కుమార్, ఆర్డీవో అశోక్ రెడ్డి, అధికారులు , ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### గత ప్రభుత్వంలో గులాబీ కార్డులకే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గతి పది సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వంలో పేదలకు అందవలసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలని గులాబీ కండువాలు కప్పుకున్న గులాబీ కార్డుదారులకే సంక్షేమ పథకాలను చెందాయని ఈ ప్రజా పాలనలోనైనా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను పేదవారికి చెందే విధంగా ఉండాల్సి ఉండగా గత ప్రభుత్వం అమలు చేసిన ట్రాక్టర్లు, దళితబంధు, రేషన్ కార్డు లాంటి తదితర పథకాలన్నీ గులాబీ పార్టీ నాయకులు,కార్యకర్తలకు చెందాయని ఆరోపించారు.






# టిబి రహిత జిల్లాగా సూర్యాపేట

## కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సూర్యాపేట జిల్లాను టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లావైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏర్పాటు చేసిన బోస్ ఫౌండేషన్ ఆప్టిమస్ ఫార్మాషూటికల్ సెగ్మెంట్, ఫార్మసిటికల్ లోక్ భారతి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌షన్ ద్వారా టిబి కిట్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం లోపం వల్ల టిబి వస్తుందని వైద్య సిబ్బంది టిబి రోగులను గుర్తించి బలమైన ఆహారం, వైద్యం న్యూట్రిషన్ కిట్లను ఉచితంగా అందించాలని టిబి రోగులకు ప్రధానమంత్రి టిబి ముక్తా భారత్ అభియాన్, పిఎం టిబి ఎంబిఎ పథకం కేంద్రం ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు. టిబితో ఇబ్బంది పడేవారు తప్పని సరిగా ఆరునెలల పాటు మందులు వాడాలని, మధ్యలో వాడకపోతే జబ్బు తగ్గదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం, డిప్యూటి డిఎంహెచ్‌వో జయ మనోహరి, టిబి ప్రోగ్రాం అధికారిని నాజియా, డాక్టర్ వెంకటపాపిరెడ్డి, శ్రీశైలం, డిపివో ఉమా, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారం చేయొద్దు

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ప్రాంత ప్రజలకు ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఏవైనా అపోహలుంటే పోలీస్ వారిని సంప్రదించాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు. గురువారం దేవరకొండ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ మీటింగ్ లో ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ గురించి ఎవ్వరు కూడా తప్పుడు ప్రచారం చేయవద్దని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని అన్నారు. తప్పుడు ప్రచారాలు ఎవరికైనా షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా తప్పుడు సమాచారం చేరవేస్తే లోకల్ పోలీస్ శాఖ కు తెలపాలన్నారు. వాట్సాప్ స్టేటస్ లలో,డీపీలు ఎవరు కూడా పెట్టుకోవద్దని అన్నారు. దేవరకొండ పట్టణంలో ఎక్కువ దొంగతనాలు జరుగుతున్నాయని,ప్రజలు స్వంత జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.ఊరికి వెళ్ళిన సమయంలో పోలీస్ స్టేషన్లో,విలేజ్ పోలీస్ ఆఫీసర్,వార్డు పోలీస్ ఆఫీసర్ లకు తెలియజేయాలని అన్నారు.సిసికెమెరాలు ఏర్పాటు చేసుకొని దొంగతనాలు జరగకుండా పోలీస్ వారికి సహకరించాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో సిఐ నర్సింహులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ సంస్థ ప్రపంచ దేశాలలో సేవలందిస్తుంది

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రెడ్ క్రాస్ సంస్థ 191 దేశాల్లో సేవలందిస్తుందని అదే స్పూర్తితో ఇండియాలో అన్ని రాష్ట్రాల్లో జిల్లాలలోఈ సంస్థ పనిచేస్తుందని జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ సిహెచ్ పుల్లారావు తెలిపారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ జన్మదినం సందర్భంగా ప్రపంచ రెడ్ క్రాస్ డే దినోత్సవంగా జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి పుల్లారావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచ దేశాల్లో సేవలందిస్తూ ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందిస్తుందని తెలిపారు. జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర స్థాయిలో సేవా కార్యక్రమాల్లో మంచి పేరు ప్రతిష్టలతో మేనేజింగ్ కమిటీ సభ్యుల సహకారంతో ముందుకు వెళ్తున్నామని సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ 191 దేశాల్లో సేవలందిస్తుందని అదే స్పూర్తితో ఇండియాలో అన్ని రాష్ట్రాల్లో అన్ని జిల్లాలలో సంస్థ పనిచేస్తుందని భారత పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన రెడ్ క్రాస్ సంస్థ వివిధ రాష్ట్రస్థాయిలో జిల్లాల్లో పనిచేస్తుందని నల్లగొండ జిల్లాలో 1965లో స్థాపించిన రెడ్ క్రాస్ సంస్థ 60 సంవత్సరాల నుండి జిల్లా ప్రజలకు సేవలందిస్తూ రెడ్ క్రాస్ అధ్యక్షులు జిల్లా కలెక్టర్ సూచనలతో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్




రెడ్డి ఆధ్వర్యంలో రక్తంతో పాటు చైర్మన్ సహకారంతో వారి సోదరుడు స్వర్గీయ గోలి వెంకట్ రెడ్డి పేరుతో మహాప్రస్థానం వెహికల్ అదేవిధంగా జనరిక్ మెడికల్ షాప్ బాడీ ఫ్రీజర్ ఆక్సిజన్ కాన్సెంటర్స్ గత సంవత్సరం స్వచ్ఛంద సంస్థలు లైన్స్ క్లబ్ పోలీస్ శాఖ బ్యాంకు సంస్థల ప్రజాప్రతినిధులు అధికారుల యూత్ సంఘాల సహకారంతో 1836 యూనిట్ల రక్తాన్ని సేకరించి జిల్లా ప్రజలకు అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ మెంబర్ సూరెడ్డి సరస్వతి, కొప్పుల శ్రీలత, సాయి నిశ్చల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాములు, యూత్ వాలంటీర్స్ ఎన్నమ్మల అంజయ్య, నేతి విప్లవ కుమార్, శివ సాయి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది నిర్మల ప్రదీప్ రెడ్డి, సద్దాం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## హన్యానాయక్‌కు పరామర్శ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఏడుకోట్ల తండా 12వ వార్డుకు చెందిన ధీరావత్ హన్యానాయక్ ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకొని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గురువారం గ్రామానికి చేరుకొని లోక్యా నాయక్‌ను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని, ఆరోగ్య నియమాలను పాటించాలని సూచించారు. మాలోతు శ్రీనునాయక్, సీతారాములునాయక్, భీకానాయక్, శ్యామ్, కిషన్ తదితరులు ఉన్నారు.

## సాయి వర్షిత్‌ను అభినందించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించిన మునుగోడు మండల కేంద్రానికి చెందిన దుబ్బ విజయభాస్కర్ రాదల కుమారుడు సాయి వర్షిత్ ను గురువారం మండల కేంద్రంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా సాయి వర్షిత్ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకాల ధ్వంసంపై బిఆర్ఎస్ నిరసన

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలో గత ప్రభుత్వం అభివృద్ధి పనుల శిలాఫలకాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వంసం చేశారని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల శాఖ చేపట్టిన అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మా ప్రభుత్వం కోటి రూపాయలతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నిర్మాణం చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ శిలాఫలకాన్ని ధ్వంసం చేసి కొత్త శిలాఫలకం ఏర్పాటు చేసి ప్రారంభించిన క్యాంప్ ఆఫీస్ ని మళ్లీ ప్రారంభించడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పగిళ్ల సతీష్, మారగోని అంజయ్య, మేకల శ్రీనివాస్ రెడ్డి, ఈద శరత్ బాబు, పోలగోని సైదులు, ఎడవల్లి సురేష్ కుమార్, బోయ లింగ స్వామి,దోటి కరుణాకర్, ఐతగోని విజయ్, బండారు శ్రీనివాస్, పందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఐకెపి కేంద్రాల్లో రైతుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ఐకెపి కేంద్రాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం, సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఐకెపి కేంద్రాలు ప్రారంభమై రెండు నెలలయినప్పటికీ ఐకెపి కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నేటికి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేదని ఆరోపించారు. ఐకెపి కేంద్రాల్లో బస్తాలు, లారీల కొరత మూలంగా కొనుగోలుకు తీవ్ర జాప్యం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా అయిన ధాన్యం మిల్లుల వద్ద దింపుకొని సందర్భంగా బాగా ఆలస్యమవుతుందని, ఐకెపి కేంద్రాల్లోకు మూడు, నాలుగు రోజులకు లారీలు వస్తున్నాయని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు దండా వెంకటరెడ్డి, కందాల శంకర్‌రెడ్డి, దేవరం వెంకటరెడ్డి, కొప్పుల రజిత, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, సుదర్శన్, ఉప్పలయ్య, మండది రామిరెడ్డి, బుర్రి శ్రీరాములు, షేక్ సైదా, స్టాలిన్‌రెడ్డి, యాదగిరిరావు, నర్సింహారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలి




**ప్రజాపక్షం/మోతె:** అర్హులైన పేదలందరికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టపల్లి సైదులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పార్టీ మోతె మండల కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయకుండా గ్రామాల్లో ఇళ్లలో కూర్చొని తమ పార్టీకి చెందిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉండగా కాంగ్రెస్‌కి చెందిన వారికే ఇండ్లు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. మండలంలోని కొత్త బస్టాండ్ వద్ద నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు కాంపాటి శ్రీను, కిన్నెర పోతయ్య, చర్లపల్లి మల్లయ్య, నాగం మల్లయ్య, బూడిద లింగయ్య, లచ్చిరాం, సోమగాని మల్లయ్య, గుంటగాని ఏసు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల అమ్మకాల్లో నాణ్యత పాటించాలి



**ప్రజా పక్షం/హాలియా:** విత్తనాలు ఎరువులు పురుగు మందుల విక్రయ అమ్మకాల్లో ఎరువుల డీలర్లు,రిటైలర్లు సరైన నాణ్యత పాటించాలని హాలియా ఎస్ఐ సతీష్ రెడ్డి సూచించారు. గురువారం కొత్తపల్లిలోని రైతు వేదికలో ఎరువులు, విత్తనాల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైలర్లు ఎరువులు విత్తనాలు అమ్మిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని దుకాణాల్లో ధరలు, నిల్వల పట్టికలు ఏర్పాటు చేయాలని సూచించారు. వానాకాలం సీజన్ మొదలయ్యేందుకు మరో నెల రోజులు ఉండగా నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖలకు సహకరించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సరిత మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని ప్రత్యామ్నాయ ఎరువులు పెస్టిసైడ్స్ ను రైతులకు బలవంతంగా అంటగట్టకూడదని సూచించారు. బిల్లులో సూచించిన విధంగా స్టాక్ మెయింటైన్ చేయాలని మరోసారి డీలర్లకు జాగ్రత్తలు చెప్పారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాల పై అవగాహన కల్పించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు వెంకన్న, సైదయ్య, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, రాంబాబు, లింగయ్య పలువురు డీలర్లు పాల్గొన్నారు.

## ఛిద్రమౌతున్న మహిళలకు రక్షణ లేదా



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పెద్దల సమక్షంలో పెళ్ళి చేసుకుని కలిసి ఉంటామని నమ్మించి మోసగించబడుతున మహిళలకు రక్షణ లేదా, మగవాళ్ల చేష్టలకు మహిళలు తరతరాలుగా బలికావల్సిందేనా అని ఐద్వా జిల్లా కార్యదర్శి జిట్టా సరోజ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలకేంద్రంలో భర్త, మామల వికృత చేష్టలతో వివాహ బంధాన్ని తెగతెంపులు చేసుకోవడానికి సిద్ధమైన కుటుంబం నుండి మహిళలను రక్షించాల్సిందిగా వారు వేడు కున్నారు. వివరాల్లోకి వెళ్ళితే నార్కట్‌పల్లి పట్టణంలోఆర్టిసి మెకానిక్ గా విధులు నిర్వహిస్తున్న బద్దుల మల్లేష్ తన భార్యయగు యాదమ్మను ఇంటి నుండి గెంటి వేశాడని , అదేతరహాలో కొడుకు బద్దుల మహేష్ తన భార్య యగు బద్దుల దుర్గమల్లేశ్వరిని మూడు సంవత్సరాల పాపను గెంటివేశారని అత్తా కోడళ్ళు యాదమ్మ, దుర్గ మల్లేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలకేంద్రంలోని బద్దుల మల్లేష్ ఇంటి ముందు దీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళు సుక్క లక్ష్మమ్మ, బాల నర్సమ్మ, లింగాల మల్లమ్మ, రేణుక, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఇందిరమ్మ గృహాల కోసం అప్లికేషన్ చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ గృహాలను మంజూరు చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ అన్నారు. అర్హులైన వారందరికీ గృహాలను మంజూరు చేయాలని భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో ఇన్చార్జి కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లాటరీ పద్ధతిలో తీయడం జరిగింది కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీ సభ్యులు అని కాంగ్రెస్ కార్యకర్తలను పెట్టి వారు నిర్ణయించిన పేర్లనే ఫైనల్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఇట్టబోయిన గోపాల్, చెన్న మహేష్, కాజా అజీముద్దీన్, దొడ్డికాడి భగత్, తుమ్మల పాండు, తాడూరు బిక్షపతి, తాడెం రాజశేఖర్, వెల్దుర్తి రఘునందన్, ఎన్నబోయిన జాంగిర్, బర్రె రమేష్, కాజం, అంజాద్, అజయ్, రహీం, సురేష్ యాదవ్, సూరజ్, ఇండ్ల శ్రీను పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/ నాంపల్లి:** మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు వేగవంతంగా జరపాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రావణ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించి తేమ శాతం 17, మరయు తాలు 3, శాతం కన్నా ఎక్కువగా లేని వడ్లను మాత్రమే కొనుగోలు చేయాల్సిందిగా వ్యవసాయ విస్తరణ అధికారులకు మార్కెట్ సిబ్బందికి సూచించారు.క్షేత్రస్థాయిలో వున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులను సూచించారు.

## నిరాధారమైన ఆరోపణలు సరికాదు

**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో రాజగోపాల్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల పై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు మండలంలో ఎలాంటి శిలాఫలకాలను ధ్వంసం చేయలేదని,క్యాంప్ ఆఫీస్ ఆధునీకరణ పేరుతో చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించానే తప్ప ఎలాంటి శిలాఫలకాలను ధ్వంసం చేసే అలాంటి చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.ఈ సమావేశంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ డ్యూటీ నారాయణ, డైరెక్టర్లు ఎండి హైమద్, కుంభం చెన్నా రెడ్డి, నాయకులు భీమనపల్లి సైదులు, మిర్యాల వెంకన్న, మాధగోని రాజేష్, ముచ్చపోతుల శ్రీనివాసులు, జాజుల సత్యనారాయణ నడింపల్లి యాదయ్య, మందుల బీరప్పపాల్గొన్నారు.





## విద్యార్థిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణానికి చెందిన చిన్న దర్గా మూటవల్లి సయ్యద్ హమ్జాద్ అలీ కుమారుడు అష్రఫ్ పదో తరగతి పరీక్షల్లో 565 మార్కులు పొందిన సందర్భంగా దేవరకొండ పట్టణంలో గురువారం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అష్రఫ్ ను అభినందించారు. శాలువాతో అష్రఫ్ ను సత్కరించారు.భవిష్యత్తు లో మరిన్ని విజయాలు సాధించాలని రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రమావత్ రమేష్,ఖాదర్ బాబా,మకాం చంద్రమౌళి,పొట్ట మధు,ఎస్.కె.జమిర్ బాబా,గందురి లక్ష్మణ్,బాబా ఉన్నారు.

## నేడు చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రం లోని రైతు వేదిక లో నేడు మధ్యానం 2. 30 నిమిషాలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నారని వలిగొండ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్న ఎపిఎం




**ప్రజాపక్షం/బీబీనగర్ :** మహిళా సభాన సంఘాలకు2024/2025 సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించి మహిళా సంఘంల అభివృద్ధి కోసం కృషి చేసిన ఏపియం శ్రీనివాసులును రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ప్రతిభ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డు నుగురువారం హైదరాబాద్‌లో మహాత్మ జ్యోతిబాపూలే ప్రగతిభవన్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దినసరి అనసూయ సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీలో కేష్ కుమార్ సెర్ప్ సీఈవో దివ్య చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందుకోవడం పట్ల మండల సిసిలు మల్లేశం, నర్మద మహిళా గ్రూప్ సభ్యులు దేవరుప్పల పద్మ, అలివేలు వర్షం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాపక్షం/మునుగోడు :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్లోరి గూడెం అడ్డరోడ్డు ,గూడపూర్ మద్యలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు గ్రామ పంచాయితీ పరిధిలోని లక్ష్మీ దేవిగూడెంకు చెందిన ఎంపల్ల నరేష్ నల్లగొండలో నివాసం ఉంటూ సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుండి నల్లగొండకు వెళ్లుతుండగా గూడపూర్ దగ్గర ఎదురుగా వస్తున్న టాటా ఎసీ వాహనం డీ కొనడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మునుగోడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

# ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాలు ఆర్జించవచ్చని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ డాక్టర్ కె.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుతో ఒక ఎకరానికి రూ.1.25 లక్షలు ఆదాయం పొందవచ్చన్నారు. అంతర పంటలు వేసుకున్నట్లయితే మరో రూ.50 వేలు లాభం పొందవచ్చన్నారు. దేశంలో ప్రస్తుతం 10లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు భారీ ప్రోత్సహాకాలు అందిస్తుందని, బిందు సేద్యంకు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీలకు 90శాతం, బీసీలకు ఐదెకరాల లోపు ఉంటే 90శాతం, ఐదెకరాల కంటే ఎక్కువ ఉంటే 80శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రామేశ్వర్, రైతులు శ్రీను, జీడయ్య, మోయినొద్దిన్ తదితరులు ఉన్నారు.

# స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ కరాటే క్యాంప్




**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు గురువారం మార్షల్ ఆర్ట్స్, కరాటే సమ్మర్ క్యాంపును అసోసియేషన్ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ కరాటే క్యాంప్ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు ఈరోజు ఉదయం 11 గంటలకు మార్షల్ ఆర్ట్స్ కరాటే సమ్మర్ క్యాంపు ని అధ్యక్షులు ఎన్‌విటి ప్రారంభించినారు.అనంతరం మాట్లాడుతూ ఆత్మ రక్షణ కోసం కరాటే చాలా అవసరమని ముఖ్యంగా అమ్మాయిలకు చాలా అవసరమని అన్నారు.పిల్లల్ని ప్రోత్సహిస్తూ కరాటే,డాన్స్, క్రీడలకు అనుమతి ఇచ్చి వాళ్ళని గ్రౌండ్ వరకు తీసుకొచ్చి ఆడిపిస్తున్న తల్లిదండ్రులకి అభినందనలు తెలియజేశారు. క్రీడలతో మానసికంగా శారీరికంగా ఎంతో దృఢంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి ,తాళ్ల సురేష్, రాపోలు నిరంజన్, అన్వర్, నవీన్, డాన్స్ మాస్టర్స్ రాక్ స్టార్ రమేష్, ఏడుకొండలు, అనిల్, సుజిత్ ,విశ్వనాథ్, మధు, అనిల్, నగేష్ ,లక్ష్మణ్, యాదయ్య ,విష్ణు, విద్యార్థులు క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపి ప్రభుత్వ దౌర్జన్యంపై జర్నలిస్టుల నిరసన




సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై ఏపీ ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యం చేయించడాన్ని ఖండిస్తూ జర్నలిస్టులు నల్లగొండ పట్టణం పెద్ద గడియారం సెంటర్‌లో గురువారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సాక్షి బ్యూరో ఇన్‌చార్జి చింతకింది గణేష్, ఎడిషన్ ఇన్‌చార్జి బొడ్డు జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తప్పులను ఎత్తి చూపితే ఏపీ ప్రభుత్వం పోలీసులతో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై దాడులు చేయించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులను జాగృత పరిచి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వాస్తవాలను వెలికి తిసి పత్రికల్లో రాస్తే ఏపీ ప్రభుత్వం కక్షకట్టి అక్రమ కేసులు పెట్టి వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి టీవీ ప్రతినిధి పాశం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలికి తీస్తున్న సాక్షి మీడియాపై, సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై దాడులు చేయించడం దారుణమైన విషయమన్నారు. ప్రభుత్వం తన తీరు మార్చుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు సంఘాల బాద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, గుండగోని జయశంకర్‌లు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించి సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడి చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. వాస్తవాలను వెలికితీస్తే ప్రభుత్వం బెదిరించే విధంగా దాడులు, అక్రమ కేసు లు పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఫయి మ్, రాతికింది అంజయ్య,గాదె రమేష్, వివిధ దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కట్టాసుధాకర్, జిల్లా యాదయ్య, వంగాల శ్రీనివాసరెడ్డి, మీసాల శ్రీనివాస్, ఆవుల లక్ష్మయ్య, తెలగమల్ల దశరథ,తుమ్మనగోటి వెంకట్, రాంప్రసాద్,శేఖర్, మధు, రవి, వేణు, శివశంకర్, నవీన్‌రెడ్డి, రషీద్, ఫొటో జర్నలిస్టులు కంది భజరంగ్ ప్రసాద్, భవాని ప్రసాద్, బత్తుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని అన్నంపట్ల గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఇల్లు పై కప్పి కూలి జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ బొక్క వసంత జైపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రమాదానికి గురైన వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిలో నివసిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయని గాయపడిన వారిని ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లుతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.



## అంతర్రాష్ట్ర సరిహద్దులో అప్రమత్తం

**ప్రజాపక్షం/నందికొండ:** హిల్ కాలనీ నాగార్జునసాగర్ లోని పశువైద్యశాలను అదేవిధంగా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న పశు సంవర్ధక శాఖ తనఖీ కేంద్రాన్ని నల్గొండ జిల్లా పశుసంవర్ధక శాఖ తనఖీ కేంద్రాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి వి రమేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగాస్థానిక పశు వైద్యశాలలో రికార్డులను పరిశీలించి అనంతరం ఆసుపత్రి గదులను పరిసరాలను పరిశీలించారు. పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువుల యజమానులకు వివరించాలని స్థానిక పశు వైద్యాధికారి కేశవ్ అజ్మీరాకు సూచించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలు మందుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, పశువైద్యశాలకు క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని తెలిపారు. ఆ తర్వాత కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న పశుసంవర్ధక శాఖ తనిఖీ కేంద్రాన్ని పరిశీలించి పశువుల రవాణా పట్ల శాఖ అధికారులు, నిరంతరం తనిఖీలునిర్వహించాలని అనుమతి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేయాలని పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

## బూటకపు ప్రచారాలను నమ్మొద్దు



**ప్రజాపక్షం /నందికొండ:** నాగార్జునసాగర్ పట్టణంలోని ప్రజలందరూ ఐక్యంగా ఉండి మతసామరస్యాన్ని కాపాడాలని సాగర్ సిఐ శ్రీను నాయక్ కోరారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సంపత్ గౌడ్ తో కలిసి వివిధ మతాలకు చెందిన మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాకిస్తాన్ భారతదేశం మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని ఎటువంటి బూటకపు ప్రచారాలను నమ్మకూడదని ఎవరైనా మతాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలలో పోస్టింగ్స్ పెడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు ఇంకా ఎవరైనా నిరసనలు ధర్నాలు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా పోలీస్ అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు ప్రస్తుతం దేశంలోని ప్రజలందరూ కూడా ఐక్యంగా ఉండి మన భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## బోరు మోటర్లు మంజూరు

**ప్రజాపక్షం /మర్రిగూడ:** మండలం కేంద్రంలో రెండు బోరు మోటర్లను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి సాకారంతో మంజురు చేయడం జరిగింది. ఈ బోర్ మోటర్ల లు ప్రజలకు ఇబ్బంది లేకుండా నీరు అందించినందుకు మర్రిగూడ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ రాజగోపాల్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్,మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్,మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య,గ్రామ శాఖ అధ్యక్షుడు పొనుగోటి శేఖర్,ఎండి భాష,చిలువేరు మహేష్, ఎండి బాబా, ఎడ్ల ముత్తయ్య, ఆర్డబ్ల్యూఎస్ వెంకటేశ్వర్లు,యూసుఫ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహం అడ్డగింత



**ప్రజాపక్షం/మానవపాడుః** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామ పంచాయితీలో గురువారం బాల్య వివాహన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. బాల్యవివాహానికి సిద్ధపడిన తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్న ఐసీడీఎస్ మహిళ అధికారి సారాగిని వివాహానికి సిద్ధపడిన బాలిక తల్లి దండ్రులకు ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ చేశారు. ఐసీడీఉస్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జల్లాపురం గ్రామ పంచాయతీకి చెందిన చాకలి పరమేష్ భార్య శారద విరి కుమార్తె శ్రావణి లనే బాలిక (15) ఈ బాలికకు గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డి గ్రామం ఈ గ్రామానికి చెందిన పరుష రాముడు (26) తన మేనమామ తో బాలిక తల్లిదండ్రులు వివాహం కుదిరించారు. తల్లిదండ్రులు ఈ నెల శుక్రవారం 9/5/2025 తేదీన వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త, మండల పోలీస్ ద్వారా తెలుసుకున్న ఐసీడీఎస్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గురువారం గ్రామాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో చర్చించి బాలిక శ్రావణి ని అలాగే తల్లి శారదను జిల్లా ఐసీడీఎస్ కు తరలించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వం తీసుకునే చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. బాలబాలికలు ఇద్దరికి వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ జోస్పీ శ్రీనువాస్ శర్మ, మండల పోలీస్ అధికారులు , గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి , మండల రెవెన్యూ సినియార్ అసిస్టెంట్ బాబు రికార్డ్ అసిస్టెంట రమేష్, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పడిగపాటి సైదిరెడ్డి సోదరి గుండ్రం కోటమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గురువారం గ్రామానికి చేరుకోని కోటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కుందూరు వీరకోటిరెడ్డి, హాతీరాంనాయక్, పలసాని రాంరెడ్డి, పెదకోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, కందుల నాగిరెడ్డి, చెన్ను రాంరెడ్డి, చంద్రశేఖర్, పున్నానాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆళ్లపల్లి పంచాయతీకి నాలుగు ఇళ్లే కేటాయింపు

**-అధికారులు తప్పుడు సర్వే చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆళ్లపల్లి పంచాయతీకి ఇందిరమ్మ ఇల్లు కేవలం నాలుగు మాత్రమే కేటాయించారు. ఈ పంచాయితీలో సుమారు 3000 జనాభా, 1900 ఓటర్లు సుమారు 1000లోపు ఇల్లు ఉన్నాయి. కానీ ఇందిరమ్మ ఇల్లులు మాత్రం కేవలం నాలుగు మాత్రమే కేటాయించారు. అర్హులు లేరా అని కాదు అర్హులను అధికారులు తప్పుడు సర్వేతో ఎల్ వన్‌లో చూపించలేకపోయారు. ఎల్ వన్ అంటే ఇల్లు లేకుండా కట్టుకోవడానికి ఖాళీ స్థలం ఉండాలి. అలా ఉన్న వాళ్లు చాలా మంది ఉన్నారు. కానీ డేటా ఎంటర్ చేసే టైంలో ఏమైందో తెలియదు కానీ ఇల్లు లేకుండా ఖాళీ జాగా ఉన్న వాళ్లు చాలా మంది ఉన్నా వాళ్లందరూ కాలి జాగలేదని ఎల్ టూలోకి మార్చారు. దీంతో ఆ రోజు గ్రామ సభలో గొడవ జరిగింది. అధికారులు రీ సర్వే చేస్తామని ఒప్పుకున్నారు. మొదట దఫాలో ఎల్ వన్‌లో 36, ఎల్ టూలో 311, ఎల్ త్రీలో 15 చూపించారు. మళ్లీ ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఎల్ వన్‌లోకి మార్చి పంపించారు. అంతా బాగానే ఉన్నా, చివరకు ఇందిరమ్మ ఇల్లు పైన లిస్ట్ వచ్చే సరికి కేవలం మొదటి సారి ప్రకటించిన ఎల్‌వన్ లిస్టు ఆధారంగా కేటాయించారు. దీనితో ఆళ్లపల్లి మండల హెడ్ క్వాటర్ పంచాయితీకి కేవలం 4 ఇల్లులు మాత్రమే వచ్చాయి. ఈ నాలుగు ఇండ్లు కూడా మొదటి దఫా ఎల్‌వన్‌లో ఉన్నా వారు కాదు, ఎల్‌టూలో వాళ్లని సెలెక్ట్ చేశారు. కోటా ఏమో ఎల్‌వన్ ఆధారంగా కేటాయిస్తారు అంట, సెలెక్ట్ ఏమో అన్ని దాంట్లో నుండి తీసుకుంటారంట. ఇది కూడా విచిత్రంగా ఉంది. దీనితో ఆళ్లపల్లి పంచాయితీ ప్రజలు అధికారులు చేసిన తప్పిదాలకు మేము మోసపోయామని ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి మాకు వచ్చే కోటాని మాకు కేటాయించాలని వేడుకుంటున్నారు. అలాగే తప్పుడు సర్వే నిర్వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చదువకున్న వాళ్లే తప్పు చేస్తే మాలాంటి నిరక్షరాశుల పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటి నుండో ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురు చూస్తుంటే తీరా అధికారులు తప్పిదాలతో మాకు ఇల్లు రాకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## యాదవుల అభివృద్ధే యాదవ విద్యావంతుల వేదిక లక్ష్యం



**ప్రజాపక్షం/ఖమ్మంః** యాదవులు విద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించాలన్నది తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక ప్రధాన లక్ష్యమని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. గురువారం లక్ష్య టాలెంట్ స్కూల్ లో విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు చెక్కిలాల మోహన్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విద్యావంతుల అవగాహన తరగతులలో ముఖ్య అతిథిగా చలకాని వెంకట్ మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని, అన్ని రంగాలలో యాదవులు ముందు ఉండాలన్నారు. నిరుపేద యాదవ విద్యార్థుల చదువు కోసం కూడా సంఘం ఆధ్వర్యంలో ఆర్థికంగా సహాయం చేయాలన్నారు. ఓట్లు మావి.. సీట్లు మీవా.. అనే నినాదంతో మన జనాభా ప్రకారం మనకు వాటా వచ్చేలా డిమాండ్ చేయాలన్నారు. చెక్కిలాల మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అప్పుడే అన్ని రంగాల్లో ముందుటారన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగా సీతారాములు యాదవ్ మాట్లాడుతూ యాదవ్ జాతి మొత్తం కూడా ఐక్యంగా ఉండాలని సమాజంలో మంచి గుర్తింపు పొందాలని, యాదవుల కోసం తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్, పసల శ్రీనివాసరావు, కట్టబోయిన మోహన్ రావు, కర్రి కుటుంబరావు, గుమ్మా రోశయ్య యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఇందుమతి యాదవ్, గోస్ వీరభద్రరావు, కొప్పుల రంగారావు,కర్రీ వెంకటేశ్వర్లు, కొప్పుల గోవిందరావు, గాయం తిరుపతిరావు, గోపి, వర్ధనబోయిన నాగేశ్వరరావు, లక్ష్య టాలెంట్ స్కూల్ అధినేత పాలగాని ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఓఎస్‌డిగా ప్రేమ్‌కరణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓఎస్‌డిగా నల్లగొండ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుండి జీవో నెంబర్ 307 విడుదల కాగా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి ఓడి బేసిన్ కింద అదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్య నిర్వహణాధికారిగా పనిచేస్తున్న నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలో వివిధ మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేశారు. నల్లగొండ జిల్లా పరిషత్ సిఇవోగా విధులు నిర్వహిస్తూ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓఎస్‌డిగా వెళ్తున్న నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డికి తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం సూర్యాపేట తరుపున శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పంతిని శ్రీధర్‌నాయుడు, రణధీర్‌రెడ్డి, శ్రీనివాస్, గుయ్యని ప్రసాద్, వరుణ్‌కుమార్, విజయ కుమారి, భద్రయ్య, మణికుమార్ తదితరులున్నారు.

## వాడపల్లి శివాలయంలో హైకోర్టు జిపి, ఎజిపిల పూజలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలోని వాడపల్లి శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో గురువారం హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ మంగీలాల్‌నాయక్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ శైలజ, అవినాష్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణ, మూసీ నదుల సంగమ క్షేత్రం లో వెలసిన మహిమాన్విత దేవాలయాల గురించి తెలుసుకోని కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి తరుణ్‌శాస్త్రి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి జ్యోతి ఉన్నారు.

## పేకాట రాయుళ్ళపై కేసు నమోదు




**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలంలోని చెరుకుపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు పేకాట బెట్టింగ్ ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు డిండి ఎస్ఐ బి.రాజు తన సిబ్బందితో కలిసి స్పాట్ కు వెళ్లి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు చాదాసు చరణ్,వెలటూరు వెంకటేశ్వర్లు,రామల వెంకటేష్ లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.మరో ఇద్దరు వ్యక్తులు రామస్వామి, బోయిని మల్లేష్ లు పరారిలో ఉన్నట్లు తెలిపారు.పట్టుబడిన వారి నుండి రూ.1020 నగదు,3 సెల్ ఫోన్స్,2 బైక్స్ సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలుకిందపడి యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/గద్వాల్ః** ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబానికి భారం కారాదని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసు తెలిపిన వివరాల ప్రకారం గద్వాలలోని బీసీ కాలనీకి చెందిన ఎరుకల శ్రీను 22 గద్వాల ఎమ్మెల్యే కాలేజీలో డిగ్రీ అనంతరం ఉస్మానియాలో అప్రెంటిస్ చేశాడన్నారు. గత ఆరు నెలలుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో తన తల్లికి భారం కాకూడదని రైలు పట్టాలపై పడుకోవడంతో శరీర సగభాగం కట్ అయిందన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఎర్రవల్లిః** అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన దేవదాస్ కుమార్తె(శృతి పావని వెడ్స్ వినోద్ కుమార్)ల వివాహ వేడుకకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్య సేవలను అందించండి

**-ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన భట్టి, దామోదర రాజనర్సింహ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కోరారు. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రిసెప్షన్, హెల్ప్ డెస్క్, ఓల్డేజ్ క్లినిక్, ఫార్మా విభాగం, ఫిమేల్ వార్డు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల విషయమై ఏర్పాటు చేసిన బోర్డును పరిశీలించారు. ఎమర్జెన్సీ మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషంట్ల సంఖ్య ఏ ఏ రకాల వ్యాధిగ్రస్తులు ఆసుపత్రికి వస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవల కోసం వస్తున్న వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మంత్రుల వెంట వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తదితరులు ఉన్నారు.

# నేటితో ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల పరిధిలో ఇందిరమ్మ గృహాలు 3500 మంజూరైనట్లు వాటిలో అర్హుల జాబితా శుక్రవారం కల్లా పూర్తవుతుందని ఆర్డీఓ రాజేంద్ర తెలిపారు. మండలాల పరిధిలోని ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, పరిశీలన అధికారులు, ప్రత్యేక శ్రద్ధతో క్షేత్రస్థాయిలో అర్హుల జాబితా ను బట్టి క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలించి గుర్తిస్తున్నారు. ఎంపికలో పారదర్శకతను పాటిస్తున్నట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లా పూర్తి చేసి తమ కార్యాలయంలో అందించాలని ఆయన పేర్కొన్నారు. నిజమైన అర్హులకే గృహాలు అందిస్తామని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో గృహాలు వారు ఇప్పటికే కొన్ని ముగ్గులు పోశారని, మరి కొన్ని పునాదులు ప్రారంభించారని ఆయన వివరించారు. అర్హుల జాబితాను బట్టి మూడు విభాగాలుగా అర్హులకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హుల జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరు కి గృహాలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# వేసవిలో ఊరు వెళ్తున్నారా.. జర భద్రం..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** వేసవి సెలవుల్లో ఇళ్ళకు తాళాలు వేసి విహార యాత్రలకు, పెళ్లిళ్లకు, బంధువుల ఇళ్లకు వెళుతున్నారా అయితే దొంగలుంటారు జాగ్రత్త అని, కనీస జాగ్రత్త చర్యలు తీసుకొని ఊరెళ్లడం మంచిదని ఈ బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు. సెలవుల్లో యాత్రలు, సొంత గ్రామాలకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను నివారించవచ్చన్నారు. వేసవి సెలవుల్లో ఇంటికి తాళం వేసి ఊరెళ్లే ఇళ్లనే దొంగలు లక్ష్యం చేసుకొనే ప్రమాదం ఉందని, తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు తెగబడి దోచుకు వెళ్లిన సంఘటనలు జరుగుతున్నాయన్నారు. విహార యాత్రలకు, పెళ్లిళ్లకు, ఊరికి వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి వెళ్తే ఇంటి పరిసర ప్రాంతాల్లో నిఘా పెట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్ఠం చేస్తున్నామన్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను మాత్రమే ఎంచుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందని కావున ఇంటి యజమానులు వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ విధిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందుకే విహార యాత్రలకు, ఊరికి వెళ్లేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించాలని ఇంటి తాళం వేసి వెళ్లే సమయంలో పక్కింటి వారితో పాటు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విలువైన ఆభరణాలు ఉంటే తమ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అత్యవసన సమయంలో 100 లేదా పోలీస్ స్టేషన్ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. మీరు ప్రయాణించే వివరాలను ఫేస్ బుక్, వాట్సాప్‌లలో పోస్ట్ చేయడం ద్వారా దొంగలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. నేరాలను అదుపు చేయడానికి పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## నూతన వధువును ఆశీర్వదించిన జైపాల్



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో పరుచూరి గార్డెన్‌లో జరిగిన తాళ్లూరి శ్రీను, పద్మ దంపతుల కుమార్తె పావని ప్రధాన వేదుకలో పాల్గొన్న వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ నూతన వధువు పావనిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్, ఏదునూరి శ్రీను(బుజ్జి), గడసందుల నాగరాజు, రేగళ్ల సైదులు, వడ్లమాని సైదులు, వేముల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ముగూడెంలో బడిబాట



**ప్రజాపక్షం/వైరా:** దుమ్ముగూడెం లక్ష్మీ నగరం గ్రామంలో నూతనంగా ప్రారంభించబడిన ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థుల సంఖ్యను (ఎన్‌రోల్మెంట్) పెంచడం కొరకు ఉపాధ్యాయుడు బొడ్డు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ యువత పెద్దల సహకారంతో బడిబాట ప్రారంభించడం జరిగింది. ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఎంపిపి ఎస్.లక్ష్మీ నగరం పాఠశాల నందు చేరుటకు ఆసక్తి కనబరచడం సంతోషంగా ఉందని అన్నారు. ఆ విద్యార్థులకు ఉచిత విద్య ఉచిత యూనిఫామ్ ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ బుక్స్, రాగిజావ, రుచికరమైన మధ్యాహ్న భోజనం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి లేని సహజ సిద్ధమైన విద్యా బోధనలతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి మేము కృషి చేస్తామని తెలిపారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం అందించే పథకాలే కాకుండా ప్రభుత్వం అందించే విధంగా కూడా పిల్లలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ బడిబాట కార్యక్రమంలో వీరేందర్, వెంకట్, అక్బర్, మస్తాన్, వీర్రాజు, తాతారావు, చింటు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు కేజీల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/ఖమ్మం :** విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని స్థానిక పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం అశ్వారావుపేట పోలీసులు భద్రాచలం రోడ్డులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఊట్లపల్లి నుండి అశ్వారావుపేట వైపుకు వెళ్తున్న మూడు బైకులపై వెళ్తున్న 7గురు అనుమానితులను పట్టుకుని వారి వద్ద నుండి సుమారు ఐదున్నర కేజీల గంజాయిని పట్టుకుని, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు రిమాండ్‌కు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉరేసుకుని యువతి ఆత్మహత్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉరేసుకుని యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మసీదు రోడ్డులో గల ఓ ఇంట్లోని బాత్రూంలో యువతి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం అందటంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, కళ్యాణి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు పెనుబల్లి మండలం, బ్రహ్మళకుంట గ్రామానికి చెందిన భుక్యా కళ్యాణి (20) తండ్రి భుక్యా గాంధీ అని, సత్తుపల్లి పట్టణంలోని కిడ్స్ కేర్ ఆసుపత్రిలో పని చేస్తుందని, మృతికి గల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. తండ్రి గాంధీ ఫిర్యాదు మేరకు ఎస్.ఐ కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నూతన వధువరులను ఆశ్వీరదించిన మంత్రి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలం లోని పలు గ్రామాలలో గురువారం పర్యటించారు. ఆచార్లగూడెం, బోదులబండ గ్రామాలకు చెందిన నూతన వధువరులను ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## జాలరికి చిక్కిన వింతైన చేప..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి ఏటిలో జాలరి కి వింతైన చేప చిక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉపేందర్ అనే జాలరి రోజు మాదిరిగానే స్థానిక ఏటి లో చేపల కోసం వలను విసరగా... అందులో అరుదైన చేప చిక్కింది. దెయ్యంబేరు అనే సముద్రం చేప చిక్కినట్లు మత్స్యకారుడు తెలిపారు. అరుదైన చేప ను స్థానికులు పెద్ద సంఖ్యలో తిలకించారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ నూతన కార్యవర్గం



**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో 2025–26 లయన్స్ ఇయర్‌కు గాను నూతన ప్రెసిడెంట్ జాలా పుల్లారావు, వైస్ ప్రెసిడెంట్‌గా జాలా మహాలక్ష్మి, సెక్రటరీ గంగవరపు కిషన్, ట్రెజరర్ పుయ్యూరు రామకృష్ణ, జీఎంటి కోఆర్డినేటర్ కట్టా శేషక్,జీఎస్‌టి కోఆర్డినేటర్ మచ్చా రామారావు, జీఈటి కోఆర్డినేటర్ యలమద్ది శ్రీను, పిఆర్‌వోగా కొర్లకుంట నాగేశ్వరరావుగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జీఎస్‌టి కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, జెడ్‌సి వుండ్రు వరలక్ష్మి , జెడ్‌సి(ఈ) చింతోజు నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు అభినందించారు.

# సైన్యం చూపిన ధైర్యం దేశానికి గర్వకారణం

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**
**-ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా సంఘీభావ ర్యాలీ**







**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి భారత సైన్యం చూపిన ధైర్యం దేశానికే గర్వకారణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. టిపిసిసి ఆదేశానుసారం గురువారం నగరంలో భారత ఆర్మీకి మద్దతుగా సంజీవరెడ్డి భవన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు శాంతియుత సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్‌లో దాగిన ఉగ్రమూకలపై రుద్రతాండవమాడి సింధూర్ ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించి సుమారు 80 మంది ఉగ్రవాదులను హతమార్చిందని ఆయన తెలిపారు. పాక్‌లోని ఉగ్రవాద సంస్థలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు యావత్ దేశ ప్రజలు గర్వపడేలా చేశాయని ఆయన తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రతి భారతీయ పౌరుడు భారత సైన్యానికి అండగా నిలవాలన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ప్రతి సైనికునిగా ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు, చోటాబాబా, సాధు రమేష్‌రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, సాయి, మొక్కా శేఖర్ గౌడ్, కార్పొరేటర్లు , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు పున్నం చందర్, రాంబాబులు తెలిపారు. గురువారం పెద్దబీరవల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో తహసీల్దార్లు మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతా భావాన్ని పోగొట్టడంతో పాటు జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, మార్పులు, చేర్పులు వంటివి సులభమవుతాయని తెలిపారు. రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తామన్నారు. బోనకల్, పెద్దబీరవల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా



పెద్దబీరవల్లిలో 200, బోనకల్‌లో 58 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్, మైథిలి తదితరులు పాల్గొన్నారు.

# తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయండి

**-రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు : పోతినేని**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. రకరకాల సాకులు చూపి తరుగు తీస్తున్నారని ఇది సరికాదని ఆయన తెలిపారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం కార్యదర్శి వర్గ సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ధాన్యం తరలింపుకు గోనె సంచిలు లేవని లారీల కొరత, కాంటాలు జరగకపోవడం రైతులకు శాపంగా మారిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాచర్ల భారతి, బొంతు రాంబాబు, వై. విక్రం, వీరభద్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీను పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి సుముఖంగా లేని లబ్ధిదారులు

**- ఆర్థికంగా ఉన్న గ్రామాన్ని**
**పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వైనం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంతో విడతలవారీగా ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా తిరుమలాయపాలెం మండలానికి 729 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ఫైలెట్ ప్రాజెక్టు కింద ఏలూవారిగూడెం గ్రామానికి మరో 39 ఇండ్లను మంజూరు చేసింది. దానిలో మొదట విడతగా 14 ఇండ్లను నిర్మించాలని అధికారులకు సూచనలు ఇవ్వగా 7గురు లబ్ధిదారులు ప్రారంభించారు. మిగితా 7గురు ప్రభుత్వం నిర్ధేశించిన కొలతల ప్రకారం ఇండ్లను నిర్మించడానికి సుముఖంగా లేరు. ఫైలెట్ ప్రాజెక్టు కింద అన్ని విధాల ఆర్థికంగా ఇండ్లు ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయడం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి వివిధ కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో చిన్న గ్రామపంచాయతీలు జోగులపాడు, తిమ్మక్కపేట, పడమటి తండా, రమణా తండా, అజ్మీర తండా, శివారురాకాసి తండా, మంగళిబండ తండా, ఏనుకుంట తండాతో పాటు శివారు గ్రామాలు ఉన్నాయి. కాని అన్ని విధాలుగా ఆర్థికంగా ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయటం ఇందిరమ్మ కమిటీలు భూములు, ట్రాక్టర్లు వాహనాలు ఉన్న పేర్లను సూచించడంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు సుముఖంగా లేరు.



గత ప్రభుత్వం ఇదే గ్రామంలో 23మందికి దళితబంధు మంజూరు చేసింది. అవిధంగానే ఇందిరమ్మ ఇండ్లను కూడా ఈ గ్రామాన్ని ఫైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు భావిస్తున్నారు. మంజూరైన లబ్ధిదారుల చుట్టూ అధికారులు తిరుగుతూ ఇండ్లు నిర్మించుకోవాలని ప్రాధేయపడుతున్నా వారు ఇండ్లు నిర్మించుకోవడానికి సుముఖంగా లేరని తెలుస్తుంది. నిర్మాణాన్ని ప్రారంభించిన లబ్ధిదారు ఇండ్లకి ఇప్పటికీ రెంటల్ లెవల్‌కి నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రెంటల్ లెవెల్ ఇల్లు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారుల అకౌంట్లో నగదు జమైనట్లు తెలిపారు.

# రామయ్యను దర్శించుకున్న పొంగులేటి దంపతులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయాన్ని రాష్ట్రరెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయమర్యాదల ప్రకారం అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. వారి పెళ్లిరోజు కావడంతో గర్భగుడిలోప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని లక్ష్మీ తాయారామ్మ వారి ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు తంపతులు, ఆర్డిఓ దామోదర్ రావు, ఆలయం ఇఓ ఎల్ రమాదేవి పలువురు పాల్గొన్నారు.

# నీటి వనరుల సంరక్షణ భావితరాలకు శ్రీరామరక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం :** నీటి వనరుల సంరక్షణ భావితరాలకు శ్రీరామ రక్ష అని, అవకాశం ఉన్న ప్రతీ చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. గురువారం ఎస్‌బిఐ రుద్రంపూర్ బ్రాంచ్ ఆవరణలో ఇంకుడు గుంత తవ్వారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూ గర్భ జలాల పరిరక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఈశ్వర్ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ రాములు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష రాసిన వారు పోర్టల్‌లో నమోదు కావాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు యు డిఐఎస్ఇ ప్లస్ పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఐడిఓసిలో ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్, ఫేషియల్ అటెండెట్స్ ప్రవేశపెట్టేలా చూడాలన్నారు. ఇంటర్ కళాశాలల్లో అతిపెద్ద మైధానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగడం లేదని, వెంటనే అన్ని శాఖల్లో ఎకరాకు ఐదు ఇంకుడు గుంతలు నిర్మించాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిలాల్ విద్యాధికారి వెంకటేశ్వరాచారి, కో ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కొబ్బరి చెట్టుపై పిడుగు.. చెలరేగిన మంటలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** పట్టణంలో గురువారం సాయంత్రం స్థానిక రాజరాజేశ్వరి ఆలయం సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా వచ్చిన గాలిదుమారంతో ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ శబ్దాలతో పిడుగులు పడ్డాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం వాటిల్లింది.

# మే 10న టిజిఆర్‌జెసి సెట్ పరీక్షా కేంద్రాల వద్ద బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమలు

**-పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** మే 10న టిజిఆర్‌జెసి సెట్ నిర్వహించనున్న పరీక్షా కేంద్రాల సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాల సమీపంలో 163 బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని 200 మీటర్ల రేడియస్‌లో గల ఇంటర్ నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు మూసివేయాలని తెలిపారు. మే 10న ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు పరీక్షా కేంద్రాల సమీపంలో ఈ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడడానికి వీలు లేదని ఆదేశాలు ఎవరైనా అతిక్రమిస్తే ఈ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిపి ప్రకటనలో తెలిపారు.